క్లుప్తంగా

స్వర్ణకార వృత్తిని కాపాడుకోవాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ గవర్నర్‌పేట రాజగోపాలచారి వీధిలోని శ్రీ విశ్వకర్మ గోల్డ్ స్మిత్ ప్రైవేటు లిమిటెడ్‌ను శుక్రవారం సందర్శించారు. సంస్థ చైర్మన్ ధనాలకోట శ్రీనివాసరావు, డైరెక్టర్ సోమల సుధాకర్, టీకి వెంకటేశ్వరరావు, కణితి శ్రీనివాసరావులు స్వామికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ దేశానికి వెన్నుముక అయిన చేతి వృత్తిదారుల్లో స్వర్ణకారులు ఒకరు అని, స్వర్ణకార వృత్తిని కాపాడుకోవాలని సూచించారు.

పితృదేవతల రుణం తీర్చలేనిది

విజయవాడ కల్చరల్: పితృదేవతల రుణం తీర్చలేనిదని ఆధ్యాత్మికవేత్త సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. ఋషిపీఠం విజయవాడ, సనాతన ధర్మవేదిక ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో 'మన కోసం మన పురాణాలు' అంశంగా నిర్వహిస్తున్న ప్రసంగం భక్తి తత్వాన్ని చాటుతున్నాయి. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సామవేదం మాట్లాడుతూ పితృదేవతలను ఆరాధించకపోతే ఇతర దేవతల అనుగ్రహం కలగదన్నారు. ధర్మాన్ని తూచా తప్పకుండా పాటించడానికి వైరాగ్యం సహకరిస్తుందని పేర్కొన్నారు. గృహస్థు ధర్మాలను బంధంతో కాకుండా బాధ్యతతో చేయాలని సూచించారు. పురాణాల్లో చెప్పిన కాలజ్ఞానాన్ని మార్కండేయ పురాణంలో వివరించారని తెలిపారు.

రజక కల్యాణ మండపం ప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 27వ డివిజన్ దుర్గాపురంలో రజక కల్యాణ మండపంను శుక్రవారం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులు సంఘటితంగా ఉండి అభివృద్ధి సాధించాలని సూచించారు. ప్రభుత్వ పరంగా తాము అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. రజకులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర నాయకులు కాకినాడ రామారావు, నవనీతం సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శుక్రవారం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన కుంకుమార్చనలు పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారు, అమ్మవారికి విశేషంగా అర్చనలు, అభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.

రాష్ట్ర ఖ్యాతిని చాటండి



విజయవాడస్పోర్ట్స్: జాతీయ పోటీల్లో విశేష క్రీడా నైపుణ్యం ప్రదర్శించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు ఆంధ్రప్రదేశ్ వాలీబాల్ జట్లకు సూచించారు. ఈనెల ఏడు నుంచి 13వ తేదీ వరకు రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగే జాతీయ సీనియర్ వాలీబాల్ పోటీలకు ప్రాతినిథ్యం వహించే రాష్ట్ర జట్లకు శాప్ కార్యాలయంలో జెర్సీలను శాప్ ఎండీ గిరిషాతో కలిసి శుక్రవారం ఆయన అందజేశారు. నాలుగేళ్ల తర్వాత రాష్ట్ర వాలీబాల్ జట్టు జాతీయ పోటీలకు వెళుతోందని రవి నాయుడు వెల్లడించారు. జాతీయ పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

చెత్త సమస్యలు

- స్థానిక 58వ డివిజన్‌లో పడకేసిన పారిశుద్ధ్యం
- ప్రజలు గగ్గోలు పెడుతున్నా పట్టించుకోని అధికారులు



అమెరికన్ హాస్పిటల్ రోడ్డులోని సెయింట్ ఆన్స్ స్కూల్ సమీపంలో దుస్థితి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 58వ డివిజన్ పరిధిలో పారిశుద్ధ్యం పడకేసింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పుణ్యమాంటూ ఈ డివిజన్‌లో ఉన్న చెత్త డంపింగ్ యార్డ్ సమస్యకు పరిష్కారం లభించడంతో స్థానిక ప్రజలంతా కాస్త హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. అయితే ప్రస్తుతం ఈ డివిజన్‌లో శానిటరీ అధికారుల పనితీరు లోపం కారణంగా ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా చెత్త సమస్యలు దర్శనమిస్తున్నాయి.

శానిటరీ అధికారుల నిర్లక్ష్యం

విస్తీర్ణం, జనాభా పరంగా 58వ డివిజన్ కాస్త పెద్దది. సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్ నుంచి కృష్ణా హోటల్ సెంటర్ వైపుగా పైపులరోడ్డు, పీఅండ్‌టీ కాలనీ, వడ్డెర కాలనీ, ఆంధ్రప్రభకాలనీ, నందమూరినగర్, భారతమాత మందిరం రోడ్డు, సన్ సిటీ కాలనీ, షణ్ముఖనగర్, ఇందిరానాయక్‌నగర్ పరిసర ప్రాంతాలు ఉన్నాయి. అయితే ఇంత పెద్ద డివిజన్‌పై శానిటరీ అధికారులు మాత్రం చెత్త సేకరణ, మురుగు తొలగింపు పనుల్లో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తమ ప్రాంతాల్లో చెత్త సమస్య అధికంగా ఉందని.. కాలువలు సరిగా తీయడం లేదని.. దుర్వాసన, దోమలతో అల్లాడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహిస్తున్నారని ఆయా కాలనీల వాసులు వాపోతున్నారు.

దోమలు, దుర్వాసనలతో అవస్థలు

రోడ్లు, ఇంటి ముందు ఎక్కడ పడితే అక్కడ చెత్త, మురుగు ఉండటం వల్ల వాటి నుంచి వస్తున్న దుర్వాసనలు, దోమల సమస్యలతో ఇళ్లల్లో అస్సలు ఉండలేకపోతున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలు తరచూ జ్వరాల భారిన పడుతున్నారని, కనీసం ఇళ్ల ముందు కాలువలు కూడా సరిగా తీయడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత కార్పొరేషన్ ఉన్నతాధికారులు ఈ డివిజన్‌లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఎక్కడ చూసినా చెత్త కుప్పలే

ఈ డివిజన్ పరిధిలోని అన్ని ప్రధాన రహదారుల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు అధ్వానంగా మారి దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా చిన్న పిల్లలు అధికంగా ఉండే పాఠశాలల పరిసర ప్రాంతాల్లో సైతం పరిశుభ్రంగా ఉంచడంలో అధికారులు విఫలమవుతున్నారు. సింగ్‌నగర్ అమెరికన్ హాస్పిటల్ రోడ్డులోని సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద, వివేకానంద సెంటినరీ హైస్కూల్ వద్ద, మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియం ముందు, వెనుక భాగాల్లో, భారతమాత మందిరం రోడ్డులోని గ్యాస్ గోడౌన్ వద్ద ఇష్టం వచ్చినట్లుగా చెత్తను రోడ్లమీదే వదిలేయడంతో ఇవి డంపింగ్ యార్డ్‌లను తలపిస్తున్నాయి.



వివేకానంద స్కూల్ వద్ద చెత్త కుప్ప

తీవ్ర ఇబ్బందులు

సెయింట్ ఆన్స్ స్కూల్, వివేకానంద స్కూల్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు అధికంగా ఉంటున్నాయి. రోడ్లపైనే చెత్త ఎక్కువగా ఉండటంతో విద్యార్థులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి ఈ పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నా.



– ఎస్‌కే నిజాముద్దీన్, 58వ డివిజన్

అధికారులు చర్యలు తీసుకోవాలి

చెత్త సరిగా తీయకపోవడంతో నివాస ప్రాంతాలు, కాలనీల్లోని ప్రధాన రోడ్డు డంపింగ్ యార్డులా మారుతున్నాయి. జీసీఆర్ కాలనీని ఎంతో శుభ్రంగా ఉంచుకునేవాళ్లం. కానీ ఇప్పుడు డంపింగ్ యార్డును తలపించేలా చెత్తను వదిలేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.



– హరికృష్ణ, జీసీఆర్ కాలనీ

హెర్బల్ కాస్మొటిక్స్ రంగంలో ఉపాధి అవకాశాలు అధికం



హెర్బల్ కాస్మొటిక్స్ వివరాలు అడిగి తెలుసుకుంటున్న ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి, స్వప్న

మధురానగర్(విజయవాడసెంట్రల్): హెర్బల్ కాస్మొటిక్స్ రంగంలో ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయని ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల వృక్షశాస్త్రం విభాగం ఆధ్వర్యాన హెర్బల్ కాస్మొటిక్స్ సర్టిఫికెట్ కోర్సు ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన హెర్బల్ ఉత్పత్తుల ప్రదర్శనను ప్రిన్సిపాల్ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇక్కడ నేర్చుకున్న అంశాలను ప్రయోగాత్మకంగా తెలుసుకునేందుకు ఇటువంటి ప్రదర్శన లు దోహదపడతాయన్నారు. రసాయనాలు లేకుండా తయారుచేసిన హెర్బల్ ఉత్పత్తుల వల్ల హానికర ప్రభావం ఉండదని ప్రజల్లో మంచి ఆదరణ ఉంటుందని అన్నారు. ఇంత మంచి ప్రదర్శన ఏర్పాటు చేసిన కళాశాల వృక్షశాస్త్ర విభాగం సిబ్బంది, విద్యార్థులను అభినందించారు. కళాశాల వృక్షశాస్త్రం విభాగాధిపతి, కోర్సు కన్వీనర్ జి. స్వప్న మాట్లాడుతూ ఈ రంగంలో రాణిస్తున్న మహిళా పారిశ్రామికవేత్తలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి విద్యార్థి ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన హెర్బల్ షాంపూలు, సోప్స్, లిప్‌స్టిక్స్, హెయిర్ ఆయిల్స్, బాడీ లోషన్స్, ఫేస్ క్రీములు, మాయిశ్చరైజర్‌ల ప్రదర్శన చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు వి. నాగ పద్మావతి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై బ్లేడుతో దాడి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): పాత కక్ష్యల కారణంగా వ్యక్తిపై బ్లేడుతో దాడి చేసిన ఘటనపై ఎస్ఎస్‌పురం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పిన్నిశెట్టి భవానీశంకర్ అనే వ్యక్తి భార్యతో మనస్పర్థల కారణంగా కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు. కేటరింగ్ పనులు చేస్తూ రాత్రుళ్లు బీఆర్టీఎస్ రోడ్డులో నిద్రిస్తుంటాడు. ఈ క్రమంలో ఈ నెల ఒకటవ తేదీ రాత్రి 11 గం.ల సమయంలో నిద్రిస్తుండగా గతంలో అతనితో గొడవ పడిన కాదా విజయ్‌కుమార్ అనే వ్యక్తి కొంత మంది వ్యక్తులతో వచ్చి భవానీశంకర్‌తో గొడవకు దిగి బ్లేడుతో ముఖంపై దాడి చేసి గాయపర్చాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉన్నత విద్యారంగ సమస్యల పరిష్కారానికి వినతి



మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఇతర ఉన్నత విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘం (ఏబీఆర్ఎస్ఎం) నేతలు శుక్రవారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె. మధుమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వై. వి. రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.ఎస్. వి.ఎస్. బాలసుబ్రహ్మణ్యం, డిగ్రీ కళాశాల విభాగం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ కె. బాలకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాలకు పూర్తి స్థాయి ఉపకులపతులను నియమించాలని కోరారు. అలాగే విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఐదు వేల అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని, నూతన జాతీయ విద్యావిధానంపై విద్యాసంస్థలకు, అధ్యాపకులకు సరైన అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే విద్యాశాఖ అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏబీఆర్ఎస్ఎంకు ప్రొఫెసర్ మధుమూర్తి హామీ ఇచ్చారు. అనంతరం నూతన సంవత్సరం సందర్భంగా తయారు చేసిన 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

నార్ల బాల సాహిత్యం అపూర్వం

సాహితీవేత్త సీతారామ్



రతన్‌టాటా సంస్మరణ సభలో మాట్లాడుతున్న దాసరి రామకృష్ణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సాహితీవేత్త నార్ల చిరంజీవి సృష్టించిన బాల సాహిత్యం అపూర్వమని ప్రముఖ సాహితీవేత్త, విమర్శకుడు సీతారామ్ అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న 35వ విజయవాడ పుస్తక మహోత్సవం రెండో రోజు ప్రధాన సాహిత్య వేదికపై నార్ల చిరంజీవి శతజయంతి సభను నిర్వహించారు. ముఖ్యవక్త సీతారామ్ మాట్లాడుతూ ఏడు దశాబ్దాల క్రితమే నార్ల చిరంజీవి రచించిన తెలుగు పూలు నేటికీ బాలలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చదవవలసిన పుస్తకమన్నారు. తెలుగు సాహిత్యానికీ, తెలుగుజాతికీ నార్ల చిరంజీవి చేసిన సేవ బాలసాహిత్యానికి మాత్రమే పరిమితం కాలేదని చెప్పారు. ఆయన తన రచనల ద్వారా అభ్యుదయ భావాలు, ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడ్డారని చెప్పారు. ఆకాశవాణి పూర్వసంచాలకు ముంజులూరి కృష్ణకుమారి మాట్లాడుతూ ఎంతో క్లిష్టమైన సామ్యవాద భావాలను పిల్లలకు కథల ద్వారా నేర్పిన ఘనత నార్ల చిరంజీవిదని కొనియాడారు. వివిధ కథలను ఉదహరిస్తూ హింస లేకుండా సామ్యవాద భావాలను ఎలా సాధించవచ్చో ఆయన సూచించారన్నారు. శ్రీశ్రీ పబ్లిషర్స్ అధినేత, సాహితీ మిత్రులు సంస్థ నిర్వాహకులు విశ్వేశ్వరరావు సభలో పాల్గొన్నారు.

రతన్‌టాటా దేశానికి గర్వకారణం

పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటా దేశానికి గర్వకారణమని పారిశ్రామికవేత్త దాసరి రామకృష్ణ అన్నారు. రతన్‌టాటా సంతాప కార్యక్రమం బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో పరిశ్రమలకున్న పాత్రను గుర్తించి, దాన్ని సమాజం, ప్రభుత్వం కూడా గుర్తించే స్థితికి చేర్చిన వ్యక్తి రతన్ టాటా అన్నారు. పుస్తక మహోత్సవ సంఘం అధ్యక్షుడు కె.లక్ష్మయ్య సభకు స్వాగతం పలికారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రం పూర్వసంచాలకులు ముంజులూరి కృష్ణకుమారి, బాలాంత్రపు నాగప్రసూన ప్రతిభా వేదిక మీద నిర్వహించే కార్యక్రమాలను వివరించారు.

మల్లవల్లి రైతుల హౌస్ అరెస్ట్ దుర్మార్గం

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లి రైతులను హౌస్ అరెస్ట్ చేయడంపై వైఎస్సార్ సీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. వందలాది మంది పోలీసులు గ్రామంలో మోహరించడంపై నిప్పులు చెరిగారు. పచ్చని పొలాలను ప్రభుత్వానికి ఇచ్చిన రైతులను కూటమి ప్రభుత్వం సంఘ విద్రోహ శక్తులుగా చిత్రీకరిస్తూ.. హౌస్ అరెస్ట్‌లు చేయడం దుర్మార్గమన్నారు. ఏపీఐఐసీ పారిశ్రామికవాడ భూసేకరణలో నష్టపరిహారం అందని రైతులకు కూటమి ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అంతేకానీ పంటలు పండించే రైతులపై ఉక్కుపాదం మోపడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై నమ్మకంతో గత టీడీపీ హయాంలోనే ఏపీఐఐసీకి ఇక్కడి రైతులు భూములు అప్పగించారని గుర్తుచేశారు. కానీ పరిహారం అందించకుండా రైతులను కూటమి సర్కారు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా రైతులకు కులాలు, పార్టీలను ఆపాదిస్తూ.. పరిహారం చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. ఈ ప్రాంత రైతులకు న్యాయం చేస్తానని మల్లవల్లి పర్యటన సమయంలో పవన్‌కళ్యాణ్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. న్యాయం చేయడమంటే బలవంతంగా భూములు లాక్కోవడమేనా.? సమాధానం చెప్పాలన్నారు. తక్షణమే మల్లవల్లి రైతులకు ప్రభుత్వం పరిహారం అందజేయాలని.. లేకుంటే రైతుల తరపున వైఎస్సార్ సీపీ పెద్దఎత్తున పోరాటం చేస్తుందని మల్లాది విష్ణు హెచ్చరించారు.

బాలల హక్కుల చట్టాలపై అవగాహన



బాలల చట్టాలపై అవగాహన కార్యక్రమంలో అధికారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బాలల హక్కుల చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ డి. సాంబశివరావు సూచించారు. దుర్గాపురం సీఐటీయూ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి నాగమణి అధ్యక్షతన కిశోర వికాసం బాలల హక్కుల చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. అలాగే బడికి వెళ్లని పిల్లలను గుర్తించి వారికి అవగాహన కల్పించి స్కూలుకు వెళ్లేలా చూడాలని సూచించారు. ప్రతి చిన్నారి పౌష్టికాహారం తీసుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. దుర్గాపురం ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ సృజన పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల చిన్నారుల్లో వచ్చే ఆరోగ్య సమస్యలను వివరించారు. డాక్టర్ ఇందు, ఆర్ రామారావు, గౌరీ శంకర్, గాయత్రి తదితరులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ జోత్స్న, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు విజయ, నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి



పప్పులమిల్లు సెంటర్‌లోని వార్డు సచివాలయంలో వినతి పత్రం అందజేస్తున్న వలంటీర్లు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో వలంటీర్లను కొనసాగించడంతోపాటు రూ. 10వేల గౌరవ వేతనం ఇస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని చంద్రబాబునాయుడు నిలబెట్టుకోవాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వలంటీర్లు మధురానగర్ పప్పులమిల్లు సెంటర్‌లోని నాలుగవ వార్డు సచివాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బుడమేరు వరదల సమయంలో సైతం వలంటీర్ల సేవలను వినియోగించుకున్నారని చెప్పారు. వలంటీర్లను కొనసాగిస్తామని చెప్పి మోసం చేశారన్నారు. ఎన్నికల వాగ్దానం ప్రకారం వలంటీర్లకు రూ.10 వేల గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. గత ఆరు నెలలుగా బకాయి పడ్డ వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వలంటీర్స్ అసోషియేషన్ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి సావిత్రీబాయి పూలే కృషి



వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ ఐక్యవేదిక నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేశంలో మహిళల అభివృద్ధికి పాటుపడిన తొలి బహుజన మహిళ సావిత్రీబాయి పూలే అని బీసీ ఐక్యవేదిక నగర అధ్యక్షుడు పీవీఎల్ఎన్ రాజు, భట్రాజుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటం రాజు పేర్కొన్నారు. విజయవాడలో బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యాన శుక్రవారం క్రాంతి కారిణి, తొలి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మాజీ కార్పొరేటర్ పిల్లి లక్ష్మీతులసి మాట్లాడుతూ సమాజానికి ఆమె చేసిన సేవలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సావిత్రీబాయి జయంతిని రాష్ట్ర మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించిందని, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కూడా అధికారికంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు భాస్కరరావు, బీసీ ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు చాంద్, న్యాయవాది, బీసీ నాయకులు కొల్లూరి, దాలిపర్తి ధన్వంతరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్‌లో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. శైలజ, అరుణ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): హ్యాపీ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సత్యనారాయణపురంలోని ఏకేటీపీ పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ మామిడి శ్రీనివాసరావు మాట్లాడుతూ పూర్వం రోజుల్లో ఆడపిల్లలకు చదువుకునే అవకాశం గాని, బయటికి వచ్చి పనిచేసే అవకాశం గాని ఉండేది కాదని అన్నారు. ప్రస్తుత రోజుల్లో మహిళలు ఎదిగి ఎంతో ఉన్నత స్థానానికి వస్తున్నారంటే అందుకు కారణం సావిత్రీబాయి పూలే తీసుకున్న నిర్ణయమే అని కొనియాడారు. ఉపాధ్యాయురాలు సంధ్యా మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే బాలికల కోసం ప్రత్యేకమైన పాఠశాలను ఏర్పాటు చేసి దేశంలోనే మొదటి ఉపాధ్యాయురాలుగా నిలిచిందని పేర్కొన్నారు. బాలికలు సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం బాలికలకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాశ్రీ, సూర్య ప్రభ, పద్మావతి, లక్ష్మీ కుమారి, ప్రభాకర్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మంచు కురిసే వేళలో..







గత మూడు రోజుల నుంచి సింగ్‌నగర్ ప్రాంతాన్ని మంచు ముంచేస్తోంది. ఉదయం తొమ్మిది గంటలు దాటుతున్నా కూడా ఇక్కడి నివాసాలు.. వీధులపై నుంచి మంచు దుప్పటి తొలగిపోవడం లేదు. దీంతో స్థానిక ప్రజలు, చిన్నారులు మంచుతో నిండిపోయిన తమ గృహాలు, ప్రాంతాలను చూసి తాము ఊటీ.. అరకు లోయల్లో జీవిస్తున్నట్లుగా ఉందంటూ ఆనందంలో మునిగితేలుతున్నారు.

– అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడసెంట్రల్)